క్లుప్తంగా

నేడు ఆవిర్భావ వేడుకలు

భూపాలపల్లి రూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నేడు(శుక్రవారం) జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించాలని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గట్ల రాజన్న గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఎర్పడి 28 సంవత్సరాలు పూర్తి చేసుకుని 29వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో, మండల కేంద్రాల్లో జెండా ఆవిష్కరించాలన్నారు. అలగే నేడు వరంగల్ పట్టణంలోని ఓసిటీ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు కదలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు వాహనాల వేలం

కాటారం: కాటారం ఎక్సైజ్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను నేడు(శుక్రవారం) జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు సీఐ ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్, పలిమెల మండలాల్లో ఎక్సైజ్ శాఖ ద్వారా పలు కేసుల్లో పట్టుకున్న పలు రకాల వాహనాలు వేలానికి ఉంచినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాల కోసం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బాధితుడిని ఆస్పత్రిలో చేర్పించిన సిరికొండ



టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన కన్నె మహేందర్ అనే గీత కార్మికుడు ఇటీవల అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి గురువారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు కత్తి సంపత్‌గౌడ్, రామకిష్టాపూర్(టి) సర్పంచ్ గునిగంటి మహేందర్, తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



చిట్యాల: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ శివారులో సెకండ్ ఎస్సై ఎండీ.షాఖాన్ గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. పోలీస్ సిబ్బంది అస్లాం జానీ, నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదు

కాటారం: నిబంధనల ప్రకారం వడ్డీ చెల్లించినప్పటికీ ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కాటారం ముథూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ కాటారం బ్రాంచ్ మేనేజర్ తాను తాకట్టు పెట్టిన బంగారాన్ని వేలం వేశారని మండల కేంద్రానికి చెందిన చీమల వెంకటస్వామి శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు వెంకటస్వామి తెలి పిన వివరాల ప్రకారం ఐదు సంవత్సరాల క్రితం సుమారు 11 తులాల బంగారం స్థానిక ముథూట్ ఫిన్‌కార్ప్ బ్రాంచ్‌లో తాకట్టు పెట్టి రూ.2.78లక్షలు అప్పుగా తీసుకొన్నాడు. రుణం తీసుకొన్నప్పటి నుంచి ప్రతి సంవత్సరం వడ్డీ చెల్లించి రుణం రెన్యూవల్ చేసుకుంటున్నట్లు తెలిపారు. రుణం డబ్బులు చెల్లించి బంగారం తీసుకొందామని ఈ నెల 4న బ్రాంచీకి వెళ్లి మేనేజర్‌ని సంప్రదించగా బంగారం లేదు వేలం వేశామని చెప్పగా అలా ఎందుకు వేశారని ప్రశ్నించగా మేనేజర్ తనపై దుర్భాషలాడారని ఆరోపించారు. మథూట్ ఫిన్‌కార్ప్ ద్వారా అనేక మందికి అన్యాయం జరుగుతోందని తనలాంటి బాధితులు ఎంతో మంది ఉన్నారని వెంకటస్వామి తెలిపారు. తనకు న్యాయం జరిగేంత వరకు చట్టపరంగా పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

సీపీఐ నాయకుడి మృతి



చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు దేవరకొండ యాదగిరి గురువారం మృతి చెందాడు. దీంతో మృతదేహంపై సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నారపు రాజేందర్ పూలమాల వేసి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. భూమి కోసం భుక్తి కోసం సాగిన పోరాటంలో యాదగిరి పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పెంట రవి, మండల కార్యదర్శి సదానందం తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



భూపాలపల్లి రూరల్: సమ్మెకు మద్దతుగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లి రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. 11వ పీఆర్సీలో నిర్ణయించిన విధంగా కనీస వేతనం కారోబార్లకు, బిల్ కలెక్టర్లకు రూ.19,000, స్వీపర్లకు రూ.16500 చెల్లించాలన్నారు. ఈ సమ్మెలో జేఏసీ నాయకులు కుడుదుల వెంకటేష్, తాళ్లపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గండ్ర సత్యనారాయణరావు మద్దతు

పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యనారాయణరావు మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కాంగ్రెస్‌పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, కౌన్సిలర్‌దాట్ల శ్రీనివాస్, రూరల్ మండల అధ్యక్షుడు సుంకరిరాంచెంద్రయ్య, నాయకులు అంబాల శ్రీనివాస్, రాంనేని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. పంచాయతీ సిబ్బంది మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి, నిరసన కార్యాక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, సిబ్బంది వేతనాల కోసం ప్రత్యేక గ్రాంటును కేటాయించాలని కోరారు. జీఓ. 51ను సవరించి, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ కన్వీనర్ సాధుల శ్రీకాంత్, జిల్లా జేఏసీ నాయకులు తాళ్లపల్లి శ్రీధర్, చెన్నూరి రమేష్, కుడిదల వెంకటేష్, అశోక్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు అజ్మత్ అలీ, కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మహాముత్తారం: సమ్మెలో పాల్గొన్న సిబ్బంది

మహాముత్తారం: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు మండల కేంద్రంలో గురువారం మండల గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మెను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పసియుద్దీన్, ఉపాధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి భూక్యా రతన్‌సింగ్, కోషాధికారి పుల్యాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమను దోచుకుంటున్న బీఆర్ఎస్

కాటారం: గ్రామ పంచాయతీల్లో నిత్యం శ్రమిస్తున్న కార్మికుల శ్రమను బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకొంటుందని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గ్రామ పంచాయితీ కార్మికులు మండల కేంద్రంలో గురువారం సమ్మె చేపట్టారు. ఈ సమ్మెకు ఎంపీపీ పంతకాని సమ్మయ్య సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వారికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, మండల కోఆప్షన్ సభ్యుడు అజీజ్, పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు చిట్యాల శశికుమార్, దోమల శ్రీనివాస్, మెండ మల్లేశ్ పాల్గొన్నారు.

మహదేవపూర్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం పంచాతయీ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేసర్ సింగ్ సరోజన రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



మల్హర్‌లో..



కాటారంలో..



మహదేవపూర్‌లో..

నాసిరకం పనులపై విచారణ చేపట్టాలి



అంకిత్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని భూపాలపల్లి, మేడిపల్లి, తాడిచెర్ల, కాళేశ్వరం, పెగడపల్లి, మహదేవ్‌పూర్, మహాముత్తారంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేపట్టారని ఈ పనులపై విచారణ చేపట్టాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్యా సురేష్ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన నాయకులు గురువారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలల్లో టాయిలెట్స్ గదులకు డోర్లు లేవని, వంట గదిలో పాత పైపులకు రంగులు వేసి బిల్లులు కాజేశారని ఆరోపించారు. నిధులను దుర్వినియోగం చేసిన అధికారులు, కాంట్రాక్టర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సేవాలాల్ సేనా జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు వాలునాయక్, జిల్లా కార్యదర్శి రమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నేడు పోడు పట్టాల పంపిణీ

కాటారం: కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్, పలిమెల మండలాల్లో పోడు సాగు చేసుకొంటున్న రైతులకు మంజూరైన పట్టాలను నేడు (శుక్రవారం) మండల కేంద్రంలో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు మండలాలకు చెందిన లబ్ధిదారులకు స్థానిక ఎల్‌జీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం ద్వారా పట్టాలను అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి మంత్రి సత్యవతిరాథోడ్‌తో పాటు మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఉపాధి కల్పించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మల్హర్: మండలంలో తాడిచర్ల మానేరులో నడుస్తున్న మూడు ఇసుక క్వారీ పనుల్లో ఉపాధి కల్పించాలని సర్పంచ్ సత్తయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు గ్రామస్తులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద కూలీలుగా ఉన్న తమకు లారీల పైన ఇసుక నేర్పుట, పరాదలు కప్పే జీవనోపాధి కల్పించాలని తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బండి స్వామి, గ్రామస్తులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మహాముత్తారం: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

టేకుమట్ల: వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాలత ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఎంపేడులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 79 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించి, పలువురి నుంచి ముగ్గురి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొలిపాక రాజయ్య, ఎంపీటీసీ సంగి రవి, హెల్త్ సూపర్‌వైజర్ సంగీతరాణీ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, ఏఎస్ఎం రేణుక, ఆశా కార్యకర్త తిరుమల, రాజేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

సింగంపల్లిలో..

మహాముత్తారం: మండలంలోని సింగంపల్లిలో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో 40మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మమత, ఏఎన్ఎంలు సూర్యకళ, భూలక్ష్మి, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్లలో..

నియామకం



నియామక పత్రం అందిస్తున్న నాయకులు

టేకుమట్ల: కాంగ్రెస్ టౌన్ యూత్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కొలుగూరి అనిల్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడితో కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తడి, పొడి పద్ధతిలో వరిసాగు చేపట్టాలి



అవగాహన కల్పిస్తున్న సాంబశివరెడ్డి

వెంకటాపురం(ఎం): తడి, పొడి పద్ధతిలో వరిసాగు చేపట్టాలని సీసీఎక్స్ ములుగు జిల్లా మేనేజర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతులకు సీసీ ఎక్స్ ఫీల్డ్ విజిట్, అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సాంబశివరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఏడబ్ల్యూడీ పథకంలో భాగస్వాములు కావాలని, ఎవరు ఎలాంటి అపోహలు పడవద్దు అన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, నరేష్, 20 మంది రైతులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని శాంతినగర్ గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలం నుంచి వెంకటాపురం మండల కేంద్రానికి వస్తున్న ఆటోలో ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ప్రయాణికులను వెంకటాపురం మండలం శాంతినగర్ గ్రామం వద్ద దింపేందుకు డ్రైవర్ రోడ్డు పక్కకు ఆపి దింపుతున్న క్రమంలో వెనక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టడంతో ఆటో పల్టీ కొట్టి రోడ్డు పక్కకు పడిపోయింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ నారాయణ మూర్తికి, శాంతినగర్ గ్రామానికి చెందిన రమణకు, అరుగుంట పల్లి గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తులకు గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం వెంకటాపురం వైద్యశాలకు తరలించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



మృతి చెందిన పాడిగేదె

ఏటూరునాగారం: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన అంతటి దేవేందర్ అనే రైతుకు చెందిన పాడిగేదె మేత కోసం బూటారం దగ్గర అటవీ ప్రాంతం పొలాల్లోకి వెళ్లింది. ఈ క్రమంలో 33 కేవీ విద్యుత్ స్తంభానికి సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన వైర్ గేదెకు తగలడంతో షాక్‌గురై మృతి చెందింది. గేదె విలువ రూ. 60వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

నాయక్‌పోడ్‌లు సంఘటితం కావాలి



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్: నాయక్‌పోడ్‌లు సంఘటితం కావాలని తెలంగాణ ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పసుల బుచ్చయ్య పిలుపునిచ్చారు. గురువారం భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని వేశాలపల్లి గ్రామంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పసుల బుచ్చయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్థితిగతులు, నాయక్‌పోడ్ కులస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, నాయకులు ముంజంపల్లి సారయ్య, గోవర్దన్, పులి శ్రీను, దబ్బ శ్రీను, గోసుకల లక్ష్మయ్య, ముంజం సారయ్య, బీమునిసారయ్య, బొడ్డు సమ్మయ్య, మేకల తిరుపతి, మేకల లచ్చిపతి, బొడ్డు కిష్టమూర్తి, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

చిట్యాల: ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలకు మంజూరైన పార్టీ ప్రమాద బీమా చెక్కులను లబ్ధిదారులకు వారి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం అందజేశారు. మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన గాజె, మండల కేంద్రానికి చెందిన రమేష్ కుటుంబాలకు ఒక్కొక్కరి రూ.2 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చిట్యాల: వరంగల్‌లో నేడు (శుక్రవారం) నిర్వహించే ఎమ్మార్పీఎస్ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్ మాదిగ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఎంఎస్పీ మండల కన్వీనర్ నేరెళ్ల ఒదేలు అధ్యక్షతన ఛలో వరంగల్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావించిన 29 సంవత్సరాల కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పక్షాన ఎన్నో పోరాటాలు చేసి ప్రజలకు అనేక ఫలాలను అందించిందన్నారు. ఈ నెల 8న ప్రధాని వరంగల్‌కు వస్తున్న సందర్భంగా ఈ వర్షాకాల సమావేశాలలో వర్గీకరణ బిల్లుకు అమోదం తెలిపేలా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ మహాసభకు మేధవులు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొడ్డు ప్రభాకర్, పర్లపెల్లి భద్రయ్య, జాలిగపు సారయ్య, నేరెళ్ల పోచయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్‌దే



పోడు పట్టాలు అందజేస్తున్న ఎంపీపీ రజిత

వెంకటాపురం(ఎం): పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎంపీపీ బుర్ర రజిత సమ్మయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో పోడు రైతులకు ఎంపీపీ పట్టాలు అందజేసి మాట్లాడారు. పోడు రైతులకు ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టుకున్నారన్నారు. గిరిజన రైతులకు హక్కు పత్రాలను కల్పించి వారు కూడా వ్యవసాయ రంగంలో అగ్రగామిగా నిలవాలని గొప్ప సదుద్దేశంతో పట్టాలు ఇచ్చారన్నారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీటీసీ గోపు స్వప్న వాసుదేవరెడ్డి, కందారపు మధుకర్, సర్పంచ్‌లు మోహన్‌రావు, అజ్మీరా స్వప్న, కొయ్యల జయలక్ష్మి భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు పోడు పట్టాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏటూరునాగారం: జిల్లాలోని గిరిజనేతరులకు పోడు పట్టాలివ్వాలని ఎస్సీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు రఘు, గంపల శివ, వంగపండ్ల రవి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్‌హాల్‌లో గిరిజనేతరుల సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోడు పట్టాల కోసం అప్లికేషన్ పెట్టిన అర్జీదారులకు ప్రభుత్వం మొండిచేయి చూపించిందన్నారు. తాము 40 నుంచి 60 ఏళ్లగా ఇక్కడే పోడు వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నారు. 2005 పూర్వం నుంచి ఉన్న ఎస్సీ, బీసీ, ఓసీ, మైనార్టీల వర్గాలకు ఎందుకు పట్టాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలకల సాంబయ్య, సోదరి పోషయ్య, దొంగిరి రాంనర్సయ్య, ఎలకపల్లి శ్రీను, గద్దం భిక్షపతి, పాలకుర్తి దేవేందర్, చిక్క అశోక్, అతూకూరి వెంకటయ్య, ఎండీ లాల్ మహమ్మద్, అతూకూరి నగేష్, లెంకలపెల్లి శ్రీను పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణ స్థలాన్ని రక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ములుగు రూరల్: అంబేడ్కర్ భవన నిర్మాణ స్థలాన్ని రక్షించాలని కోరుతూ గోవిందరావుపేట మండల తహసీల్దార్‌కు అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ నెమలి నర్సయ్య వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నెమలి నర్సయ్య మాట్లాడుతూ.. మండల పరిధిలోని కోడగడ్డ గ్రామంలో గతంలోనే అప్పటి కలెక్టర్ అంబేడ్కర్ భవన్, ఎస్సీ కమ్యూనిటీహాల్‌కు స్థలానఇన కేటాయించినట్లు తెలిపారు. ఇప్పుడున్న ప్రభుత్వాలు ఆ స్థలాన్ని అభివృద్ధి పేరుతో అక్రమించడం బాధకరమన్నారు. వెంటనే ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహం, భవణం నిర్మాణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు, కల్లెపల్లి రమేష్, పాల్వాయి పరవూరాం, సతీష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్ నేరం



చిట్యాల: మద్యం తాగి వాహనాలను నడపడం నేరమని ఎస్సై జంగిలి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని కైలాపూర్ శివారులో వాహనాలను తనిఖీ చేశారు. కైలాపూర్ గ్రామానికి చెందిన చింతల మొగిలి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడగా.. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే పది వాహనాలకు జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి



మహదేవపూర్: మండలంలోని బెగులూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఆకుల సదానందం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు బుధవారం నివాళులర్పించారు. యువజన నాయకుడు జక్కు రాకేష్, శ్రీనివాసరావు, ఎంపీటీసీ చల్లా పద్మ, శ్రీపతిబాపు, తిరుపతిరెడ్డి, కేదరి గీతబాయి, ఓదెలు, ప్రకాష్, మనోహర్, తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ప్రవేశాలకు ఎంపిక

టేకుమట్ల/మహాముత్తారం: హాకీంపేట, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ నందు ప్రవేశాలకు టేకుమట్ల మండల స్థాయిలో ఈ నెల 10న హైస్కూల్ ఆవరణలో ఎంపిక నిర్వహించనున్నట్లు ఎంఈఓ రఘుపతి బుధవారం, తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలకు అర్హులైన 4, 5వ తరగతి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మహాముత్తారం ఇన్‌చార్జ్ ఎంఈఓ దేవానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 4, 5 టేకుమట్ల విద్యార్థులు వెలిశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహాముత్తారం విద్యార్థులు మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 10, 11న దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 4వ తరగతిలో దరఖాస్తు చేసుకోవడానికి 1-09-2014నుంచి 31-08-2015 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. 5వ తరగతి విద్యార్థులు 1-09-2013నుంచి 31-08-2014 మధ్య జన్మించిన వారు ఈ దరఖాస్తుకు అర్హులు పేర్కొన్నారు. విద్యార్థి ఆధార్‌కార్డు, ఫొటోలు, స్టడీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్లు వెంట తీసుకు రావాలని సూచించారు.

నకిలీపై నిఘా పెట్టాలి

ఏటూరునాగారం: జిల్లాలో నకిలీ విత్తనాల రవాణాపై వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా పెట్టాలని కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. మండలంలోని రైతులు మిర్చి, వరి, పత్తి, వేరుశనగ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ విత్తనాలు విక్రయాలు జరుగుతున్నాయని, రైతులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడి పంటసాగు చేసే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, నకిలీ విత్తనాల రవాణాను అడ్డుకోవాలని అధికారులను కోరారు. వ్యవసాయశాఖ, టాస్క్ ఫోర్స్ బృందాలు నిఘా పెట్టాలని కోరారు. రఘు, నర్సింగరావు, ఆయూబ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఏటూరునాగారం: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అఫ్జల్ పాషా అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రెస్‌క్లబ్ స్థలాన్ని ప్రెస్‌క్లబ్ స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం పొందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం: మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తుమికి వెంకటేశ్వరరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ, బీపీసీ, హెచ్ఈసీ, ఏసీటీ (ఒకేషనల్) విభాగాల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయని వెల్లడించారు. అందుకుగాను పదోతరగతిలో జీపీఏ 8వచ్చిన ఎస్టీ బాలురు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా స్పోర్ట్స్ కళాశాలలో హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో కూడా కొన్ని సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీటికి జీపీఏ 7 వచ్చిన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ధృవీకరణ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సంప్రదించవచ్చని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిట్యాల: అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచ్



మహాముత్తారం: రికార్డులు పరిశీలిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్

మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బొగ్గులపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గర్భిణులకు అందించాల్సిన పోషకాహారాలు మెనూ ప్రకారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూలం మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, ఆయాలు ఉన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి

చిట్యాల: రెండున్నర సంవత్సరాల పిల్లలను అంగన్ వాడీ సెంటర్‌లో చేర్పించాలని సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ కోరారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని నవాబుపేటలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రదతోపాటు సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ ఇంటింటికీ తిరిగి పది మంది పిల్లలను అంగన్‌వాడీలో నమోదు చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పుతూ పిల్లలకు సమతుల్యమైన ఆహారం అందజేస్తామని చెప్పారు. ఐదుగురు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కిరణ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్స్ శారద, రాజేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



టేకుమట్ల: సమ్మె నోటీస్ అందజేస్తున్న సిబ్బంది

పలిమెల : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేసి, పనికి గుర్తింపు, భద్రత, కనీస వేతనాల అమలు, పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా అమలుచేయాలనే డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడానికి నిరసనగా రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా ఈనెల 6 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సిబ్బంది తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డికి సమ్మె నోటీసు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కలుగూరి నాగయ్య, మట్టి కృష్ణ, దుర్గం సడవలి, చెన్నూరి బాపు, కేదారి శ్రీనివాస్, అనపర్తి సన్యాసి, కుమ్మరి మహేష్, జనగామ రమేష్, సమ్మయ్య, సురేష్, పోచయ్య, బానయ్య, విశ్వేశ్వరరావు, సారక్క, సమ్మక్క, పర్వతాలు పాల్గొన్నారు.

పర్మనెంట్ చేయాలి

టేకుమట్ల: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందిని పర్మనెంట్ చేయాలని కారోబార్ సంఘం మండల అధ్యక్షుడు మార్క శరత్ బాబు ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు బుధవారం సమ్మె నోటీస్ అందజేశారు. నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగించనున్నట్లు వెల్లడించారు. తోట సాగర్, తిరుపతి, సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన చిలుముల రాజేష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. ఆపరేషన్ కోసం డబ్బులు చెల్లించాలని బాధితుడిపై ఒత్తిడి తేవడంతో విషయం తెలుసుకుని ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా.. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన పాక ఐలయ్య, అల్లే వీరేషం, జడల్‌పేట గ్రామానికి చెందిన తనుకు వికాస్‌లు వివిధ కారణాలతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, పీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు బుధవారం పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నాయకులు ముకిరాల మధువంశీ కృష్ణ, భద్రయ్య, ప్రతాప్‌రెడ్డి, నందరాజు, లక్ష్మి ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



చిట్యాల: అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ మధుసూదన్



మహదేవపూర్: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఎస్ఐ మధుసూదన్ సైబర్ నేరాలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలియని ఫోన్ నంబర్లను లిఫ్ట్ చేయొద్దని, ఎవరికీ ఓటీపీ చెప్పొద్దని సూచించారు. ఫేస్ బుక్‌లో తెలియని వ్యక్తులతో ఫ్రెండ్‌షిప్ చేయొద్దని చెప్పారు. ఓఎల్ఎక్స్‌లో వస్తువులను కొనేటప్పుడు జాగ్రత్త వహించాలని కోరారు. సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930 లేదా 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అస్లాం జానీ, లాల్‌సింగ్, మమత, మమత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మహదేవపూర్: మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద సైబర్ నేరాలపై పోలీసులు బుధవారం అవగాహన నిర్వహించారు. పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వడం వల్ల వారు ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారని, దీనిని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు అకౌంట్ల నుంచి నగదు మాయం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ధనుంజయ్, క్రిష్ణ, విక్రాంత్, ప్రజలు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



సాయం అందజేస్తున్న మిత్రబృందం

చిట్యాల: మండలంలోని జడల్‌పేట గ్రామానికి చెందిన తనుకు వికాస్ అప్పుల బాధతో ఇటీవల ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతనితో చదువుకున్న మిత్రులు రూ.25వేలు బుధవారం వికాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మిత్రబృందం సతీష్, రాజేందర్, రాజు, సురేష్, కుమార్, మధుకర్, రవి, స్వాతి, వసంత, సంధ్య, సుమలత, దేవేంద్ర, సమ్మయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె దూడ మృతి



దూడ వద్ద బాధితుడు

కాటారం: మండలంలోని విలాసాగర్‌లో విద్యుదాఘాతంతో రైతు పెద్దపల్లి రాజయ్యకు చెందిన గేదె దూడ బుధవారం మృతి చెందింది. బాధితుడు రాజయ్య తెలిపిన వివరాల ప్రకారం మేత కోసం వెళ్లిన గేదె దూడ ప్రమాదవశాత్తు ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభం ఎర్త్‌వైర్‌కు తాకింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు రాజయ్య పేర్కొన్నారు. గేదె దూడ విలువ రూ.20వేల వరకు ఉంటుందని పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

'పెసా' గ్రామసభలు నిర్వహించాలి

వెంకటాపురం(కె): పెసా క్లస్టర్ ప్రకారం గిరిజన ఇసుక క్వారీల గ్రామసభలను నిర్వహించాలని తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ యాసం రాజు అన్నారు. పూజారిగూడెం గ్రామసభ నిర్వహించాలని కోరుతూ బుధవారం కొమ్మలమ్మ గిరిజన ఇసుక సొసైటీ సభ్యులతో కలిసి తహసీల్దార్ అంటి నాగరాజుకు వినతిపత్రం అందించారు. పెసా గ్రామసభలను తహసీల్దార్ లేకుండా ఏలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. గ్రామసభలు ఇష్టానుసారంగా నిర్వహించొద్దని కోరారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి పెసా గ్రామసభలకు తహసీల్దార్ హాజరయ్యేలా చూడాలని ఆయన కోరారు.

ఆదివాసీలకు న్యాయం చేయాలి

వెంకటాపురం(కె): మంగపేట మండలంలో 75 సంవత్సరాలుగా నివసిస్తూ భూములు, ఉద్యోగాలు కోల్పోయిన ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆదివాసీ నవనిర్మాణసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. 75 సంవత్సరాల పోరాటం అనంతరం హైకోర్టు అడవి బిడ్డలకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షించదగిన విషయం అన్నారు. ఏజెన్సీలోకి అక్రమంగా చొరబడి నివాసం ఉంటున్న వలస గిరిజనేతరులను నియంత్రించాలని కోరారు.

'ప్రైవేట్' ఫీజులను నియంత్రించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించి డీఈఓ రాంకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరేళ్ల జోసఫ్ మాట్లాడుతూ.. పట్టణంలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు విద్యాసంస్థల్లో విద్యను వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. లక్షలాది రూపాయలను తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నారని, పుస్తకాలు, యూనిఫామ్స్, టై, బెల్ట్‌లు అమ్ముతున్నా.. విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జుబేర్, రమేష్, వైష్ణవి, సుష్మిత, రేష్మ, సౌజన్య పాల్గొన్నారు.

సంకల్ప యాత్రను జయప్రదం చేయాలి

భూపాలపల్లి అర్బన్: పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం టీఎస్‌సీపీఎస్ఈయూ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ఆవరణలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిల్షాద్, శివకృష్ణ మాట్లాడారు. సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులను శాపంగా మారిన సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులను శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని ఈ అసెంబ్లీ రద్దయ్యేలోపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న జోగులాంబ గద్వాల జిల్లా నుంచి యాత్ర ప్రారంభమై 22న భూపాలపల్లికి చేరుకుంటుందని తెలిపారు. ఈ యాత్రకు ఉద్యోగులందరు సంఘీభావం తెలిపి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, యూనియన్ నాయకులు మధుసూదన్, శ్రీనివాస్, వాణి, శంకర్, స్వామి, రాజేష్, కిరణ్మయి, రామయ్యలు పాల్గొన్నారు.

గిరిజన పోరాట యోధుడు సమ్మయ్య



నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కాటారం: ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారానికి, వారి పక్షాన నిలబడి పోరాడిన యోధుడు కుడిమెత సమ్మయ్యదొర అని ప్రజా సంఘాల నాయకులు గుంటి మల్లయ్య, పీక కిరణ్ అన్నారు. కాటారం మండలం ఆదివారంపేటకు చెందిన తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడిమెత సమ్మయ్యదొర మొదటి వర్ధంతిని బుధవారం ఆయన స్వగ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాసంఘాల నాయకులు సమ్మయ్య దొర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీలకు పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలని పోరాటం చేయడంతోపాటు అనేక గిరిజన, ఆదివాసీ సమస్యలపై పోరాటం చేసిన గొప్ప వ్యక్తి సమ్మయ్యదొర అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బుర్రి శివరాజు, అక్కల బాపు, మల్లయ్య, గణేశ్ పాల్గొన్నారు.

పాటల సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న నేతలు

టేకుమట్ల(రేగొండ): భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పై అభిమానంతో జిల్లా బీఆర్ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొట్ల రవి సామ్రాట్ రాసిన పాటల సీడీని బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

సంజయ్ తొలగింపుతో రాజీనామా..!

టేకుమట్ల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షపదవి నుంచి బండి సంజయ్‌ను తప్పించడంతో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దావు రఘు బుధవారం తన పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కృషి చేసిన బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించడాన్ని నిరసిస్తూ జిల్లా ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర, మధ్యంతర ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన నాయకుడిని తొలగించడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో మండల అధ్యక్షుడు, ఎంపీపీ

కాటారం: యూత్ కాంగ్రెస్ కొత్తపల్లి గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య తెలిపారు. అధ్యక్షుడిగా చిలుముల అశోక్, ఉపాధ్యక్షులుగా చిరంజీవి, కేశవ్, ఇమ్రాన్, రాజబాబు, రజనీకాంత్, మనోహర్, శేఖర్, రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రవి, కోశాధికారులుగా స్వామి, ఎలుక స్వామి, పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు మండల అధ్యక్షుడు పేర్కొన్నారు. నూతన కమిటీకి నియామకపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆజ్మీరా రఘురాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలు చట్టవ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని సీఐ శివప్రసాద్ అన్నారు. మండలంలోని పెంకవాగులో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగితెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడే మావోయిస్టులకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సహాయ సహకారాలు అందించేందుకు పోలీస్‌శాఖ ఎల్లప్పుడు సిద్ధంగా ఉందన్నారు. ఎస్సై కొప్పుల తిరుపతిరావు, పోలీసులు తదితరులు ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని ఆశన్నగూడెం ఎల్లాపూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు తోలెం రవికుమార్ పై దాడికి పాల్పడిన మెస్సు శివకుమార్ పై కఠిన చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుతారి పాపారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో సదరు వ్యక్తి వంట పాత్రలను లాక్కోని కిందపడేయటంతో పాటు ఉపాధ్యాయుడిని అకారణంగా దుర్భాషలాడుతూ హాజరు రిజిస్టర్ చించేసి దాడికి పాల్పడ్డారని తెలిపారు. గ్రామస్తులు సముదాయించినా వినకుండా ఉపాధ్యాయుని పై దాడి చేసాడని, అతని పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఫణికుమార్, నాగేశ్వర్‌రావు, హన్మంతు, బుచ్చయ్య, లింగయ్యలు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచలో బుధవారం కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సదరం రాజయ్య ఇంట్లో గొడవ కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమణించిన కుటుంబ సభ్యులు పోలీసులకు, 108కి సమాచారం అందించగా ముందుగా చేరుకున్న రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించి బాధితున్ని ఆస్పత్రికి తరలించిన ఎస్సైని గ్రామస్తులు అభినందించారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

చిట్యాల: మండలంలోని చైన్‌పాక శివారులో ఇసుక కోసం వెళ్తున్న లారీ బుధవారం ప్రమాదశాత్తు బోల్తా పడింది. దీంతో డ్రైవర్ రవికి తీవ్రగాయాలయ్యాయి. 108కు సమాచారం అందించగా.. సివిల్ ఆస్పత్రికి తరలించారు.